

ప్రత్యేకంగా ఉగాది
ఉగాది పండుగ మోత్కూరులో ప్రత్యేకం. పండుగ రోజు ప్రదర్శనగా వెళ్లి గ్రామ దేవతలకు బోనాలు సమర్పిస్తారు. - 8లో



డీసీసీబీ చైర్మన్‌కు అవార్డు
డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డికి జాతీయ స్థాయిలో ఉత్తమ సహకార బ్యాంకు అధ్యక్షుడిగా అవార్డు లభించింది. - 8లో



న్యూస్‌రీల్

మంత్రి కోమటిరెడ్డి ఉగాది శుభాకాంక్షలు



నల్లగొండ : ప్రజలందరికీ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసే పండుగ ఉగాది అన్నారు. ఉగాది పచ్చడి లాగా ప్రతి ఒక్కరి జీవితం షడ్రుచుల సమ్మేళనంగా మారాలని, ప్రజలు సుఖసంతోషాలతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల ఆకాంక్షల కనుగుణంగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు

- ఎస్పీ చందనాదీప్తి



నల్లగొండ క్రైం : సైబర్ నేరగాళ్ల వలలో పడి ఆర్థికంగా నష్టపోకుండా సామాజిక మాధ్యమాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ చందనా దీప్తి సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. విద్యార్థులు, మహిళలు, ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్ స్టాగామ్ వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఏదైనా ఇబ్బంది వస్తే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

ఆధారాలు చూపించాలి

పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50 వేలపైన నగదు తీసుకెళ్లేవారు సరైన ఆధారాలు వెంట ఉంచుకోవాలని ఎస్పీ చందనా దీప్తి సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఓటర్లను ప్రభావితం చేసే నగలు, మద్యం, బంగారం తదితర విలువైన వస్తువులు సరఫరా కాకుండా నిరంతరం తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుభ కార్యాలకు బంగారం, సామగ్రిని కొనుగోలు చేసి తీసుకెళ్లేప్పుడు అందుకు సంబంధించిన ఆధారాలు తనిఖీ అధికారులకు చూపించాలని పేర్కొన్నారు.

అంకితభావంతో వైద్యసేవలందిస్తున్నాం

బీబీనగర్: బీబీనగర్‌లోని ఎయిమ్స్ వైద్య కళాశాల ప్రారంభమైనప్పటి నుంచి వైద్య, విద్య పరిశోధన విభాగాల్లో అంకిత భావంతో వైద్యసేవలను అందిస్తున్నామని ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా అన్నారు. ఎయిమ్స్ వ్యవస్థాపక దినోత్సం సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎయిమ్స్ పురోగతిని వివరించారు. అనంతరం పలువురు విద్యార్థులు, వైద్యులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.కార్యక్రమంలో పద్మశ్రీ ప్రొఫెసర్ యోగేష్‌చావ్లా, రిషికేష్, జీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర

నల్లగొండ రూరల్, కనగల్ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర దక్కుతుందని డీఆర్‌డీఓ నాగిరెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ మండలంలోని పెద్దసూరారం, చిన్న సూరారం, కనగల్ మండలంలోని పర్వతగిరి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని, రైతుల వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలని, క్రమ సంఖ్య ప్రకారం వివాదం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. ఉదయం, సాయంత్రం సమయంలో ధాన్యం తూకం వేయాలని.. ఎండ ఉన్నప్పుడు విరామం ఇవ్వాలని పేర్కొన్నారు. ఏదేని సమస్య ఏర్పడితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో డీపీఎం రామలింగయ్య, ఏపీఎంలు వినోద, సంకు హరి, సీసీలు గీత, నర్సింహ, అంజయ్య, శారద, వసంత, ప్రభాకర్, విజయ, నర్సింహ, జానకి తదితరులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ నాగిరెడ్డి

ఓటర్లకు 'స్మార్ట్' కార్డులు

నల్లగొండ : ఓటర్లకు ఎన్నికల సంఘం స్మార్ట్ కార్డు తరహాలో ఫొటో గుర్తింపు కార్డులను అందిస్తోంది. జిల్లాలో కొత్తగా ఓటరు నమోదు చేసుకున్న వారితో పాటు అడ్రస్, పేర్లలో మార్పులు, చేర్పులు చేసుకున్న వారికి కూడా ఈ కొత్త ఎపిక్ కార్డులను అందిస్తోంది. జిల్లాకు 1.12 లక్షలు కొత్త ఫొటో గుర్తింపు కార్డులు వచ్చాయి. వాటన్నింటిని ఓటర్లకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. ఎపిక్ కార్డును స్పీడ్ పోస్టు ద్వారా ఓటరు ఇంటికే పంపిస్తున్నారు. ఎపిక్ కార్డుతో పాటు ఓటర్ల ప్రతిజ్ఞ పత్రాన్ని కూడా పంపిస్తున్నారు.



ఎపిక్ కార్డులను కవర్లలో పెడుతున్న సిబ్బంది

కాస్త తగ్గిన భానుడి ప్రతాపం

- 4 డిగ్రీల మేర తగ్గిన గరిష్ట ఉష్ణోగ్రత

నల్లగొండ టౌన్ : మూడు రోజులుగా నిప్పులు కక్కిన భానుడు సోమవారం కాస్త నెమ్మదించాడు. నిన్నటి వరకు పగటి ఉష్ణోగ్రతలు 44.5 డిగ్రీలు నమోదుకాగా.. సోమవారం 4 డిగ్రీల మేర తగ్గింది. ఉదయం 10 గంటల వరకు వాతావారణం కాస్త మేఘావృతమై చల్లని గాలులు వీయడంతో ప్రజలు ఉపశమనం పొందారు. జిల్లాలో సోమవారం అత్యధికంగా మాడ్గులపల్లిలో 40.7 డిగ్రీలు, నేరడుగొమ్మ మండల కేంద్రంలో 40.5, నిడమనూరులో 40.3, చందంపేట మండలం తెల్దేవర్‌పల్లిలో 40.1, నాంపల్లిలో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, అత్యల్పంగా చింతపల్లి మండలం వడకొండ్లలో 36.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

- క్రోధి నామ శుభవేళ



ప్రకృతిని పులకరింపజేసేది చైత్రం. మనలను పలుకరించేది మన స్నేహం. షడ్రుచుల కలబోత మన బంధం. తిమిరాన్ని పారదోలే ఉషోదయంలా.. చిగురాకుల ఉయ్యాలలో నవరాగాల కోయిలలా అడుగిడుతున్న శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాదికి స్వాగతం.

ప్రచారానికి అగ్రనేతలు

- సభలు, సమావేశాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్న బీజేపీ
- 11న పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాక
- భువనగిరి సమావేశంలో పాల్గొననున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- నల్లగొండ అభ్యర్థి నామినేషన్‌కు తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నమలై
- రెండు నియోజకవర్గాల ఉమ్మడి సమావేశానికి హాజరుకానున్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల తరఫున ప్రచారానికి ఆ పార్టీ అగ్ర నేతలు రంగంలోకి దిగబోతున్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి పెద్ద ఎత్తున కార్యక్రమాలకు బీజేపీ శ్రీకారం చుట్టబోతోంది. నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గాల అభ్యర్థుల గెలుపు కోసం బీజేపీ రాష్ట్ర, జాతీయ నాయకులు ప్రచారంలో పాల్గొననున్నారు. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈసారి రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఎంపీ సీట్లను గెలుచుకోవాలనే వ్యూహంతో బీజేపీ జాతీయ అగ్ర నాయకత్వం ముందుకు సాగుతోంది. అందులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, భువనగిరి నియోజకవర్గాలపైనా ప్రత్యేక దృష్టి సారించింది. రెండు పార్లమెంట్ స్థానాల్లోని అభ్యర్థులు శానంపూడి సైదిరెడ్డి, బూర నర్సయ్య గౌడ్ ప్రచారంలోకి దిగారు. జిల్లా పార్టీల అధ్యక్షుల సమన్వయంతో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాల్లో మునిగిపోయారు. ఇక రాష్ట్ర, జాతీయ నేతల రాకతో పెద్ద ఎత్తున ప్రచారాన్ని ముమ్మరం చేసేలా పార్టీ నాయకత్వం కార్యాచరణ సిద్ధం చేసింది.

11వ తేదీతో సమావేశాలు మొదలు

బీజేపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్ తివారీ ఈ నెల 11న జిల్లా పర్యటనకు రానున్నారు. ఆయన ఒకే రోజు ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించే సమావేశాల్లో పాల్గొని ప్రసంగించనున్నారు. ఉదయం నల్లగొండ, మిర్యాలగూడ నియోజకవర్గాల సమావేశాలను నల్లగొండలో, మధ్యాహ్నం దేవరకొండ, నాగార్జునసాగర్ సమావేశాలను దేవరకొండలో, సాయంత్రం హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల సమావేశాలను హుజూర్‌నగర్‌లో నిర్వహిస్తారు. ఈ సమావేశాల ద్వారా క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అంచనా వేసుకోవడంతోపాటు చేపట్టాల్సిన కార్యాచరణపైనా పూర్తి స్థాయిలో ప్రణాళికలను సిద్ధం చేసుకోనున్నారు. ఆ తరువాత ప్రతి రెండు మండలాలకు చెందిన పార్టీ శ్రేణులతో సమావేశాలను జిల్లా పార్టీ నేతృత్వంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 11వ తేదీన భువనగిరిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పాల్గొననున్నారు.

యోగి ఆదిత్యనాథ్ పర్యటన

ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఈ నెల 25న గానీ, 26న గానీ రానున్నారు. నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించిన ఉమ్మడి సమావేశంలో ఆయన పాల్గొంటారు. నల్లగొండలో లేదా భువనగిరిలో ఈ సమావేశం నిర్వహిస్తారు. రెండు నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులను తరలించేలా పార్టీ ఏర్పాట్లు చేస్తోంది.

మహిళా సమావేశానికి స్మృతి ఇరానీ

మహిళలతో నిర్వహించే సమావేశానికి కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ హాజరుకానున్నారు. అలాగే బీజేపీ మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ కూడా పాల్గొననున్నారు. మరోవైపు మేథావులతో, 5వేల మంది యువతతో యువ సమ్మేళనం, దళితులు, గిరిజనులతో వేర్వేరుగా సమావేశాలను నిర్వహించేలా బీజేపీ జిల్లా నాయకత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ సమావేశాలను 15, 16, 17 తేదీల్లో నిర్వహించేలా కసరత్తు చేస్తున్నారు.

తమిళనాడు బీజేపీ అధ్యక్షుడి రాక

బీజేపీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి ఈ నెల 18న ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆ తరువాత 21వ తేదీ వరకు మరో సెట్ నామినేషన్‌ను కూడా దాఖలు చేయనున్నారు. ఈ నామినేషన్ల సందర్భంగా ఏదో ఒకరోజు కార్యక్రమానికి తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నమలై హాజరుకానున్నారు. అనంతరం ముఖ్యనేతలతోనూ నిర్వహించే సమావేశంలో పాల్గొని దిశా నిర్దేశం చేస్తారు.

హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

- కలెక్టర్ హరిచందన

నల్లగొండ : పోలింగ్ కేంద్రానికి రాలేని దివ్యాంగులు హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ దాసరి హరిచందన పేర్కొన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె కలెక్టరేట్ సమావేశ మందిరంలో దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు 'ఓటు హక్కు ప్రాధాన్యంపై' అవగాహన కల్పించారు. 85 సంవత్సరాలు నిండిన వృద్ధులతోపాటు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని దివ్యాంగులకు కూడా హోం ఓటింగ్ సదుపాయాన్ని కల్పించినట్లు తెలిపారు. అందుకోసం సాక్ష్యం యాప్ ద్వారా ఫారం 12–డిలో హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్ జెండర్లు ఓటు వేయడమే కాకుండా, ఓటింగ్‌పై అవగాహన కల్పించే విధంగా కృషి చేయాలని కోరారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ 45 శాతం కంటే ఎక్కువ వైకల్యం, పోలింగ్ కేంద్రానికి రాలేని స్థితిలో ఉన్న వారికి మాత్రమే హోం ఓటింగ్ సదుపాయం ఉంటుందన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, గిరిజన సంక్షేమ అధికారి రాజ్ కుమార్, ఐసీడీఎస్ పీడీ సక్కుబాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

చెర్వుగట్టు భక్త జనసంద్రం

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. అమావాస్య సందర్భంగా రాత్రి నిద్ర చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున చెర్వుగట్టుకు చేరుకున్నారు. దేవాలయంలో సోమవారం రాత్రి ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సురేశ్‌శర్మ, సతీష్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ అర్చక బృందం లక్ష పుష్పార్చన, సహస్రనామార్చ నిర్వహించారు. గట్టుపైన గదులు సక్రమంగా లేకపోవడంతో భక్తులు ఖాళీ స్థలంలో, రోడుపైనే నిద్ర చేశారు. గట్టుపైకి పోలీసులు వాహనాలను అనుమతిం లేదు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



లక్ష పుష్పార్చనలో పాల్గొన్న ఈఓ, పూజారులు



గట్టుపైన నిద్రచేస్తున్న భక్తులు

మూసీ జలాలు వృథా



బొప్పారం చెరువు తూము నుంచి లీకవుతున్న నీరు

- ధ్వంసమైన బొప్పారం చెరువు తూము షట్టర్
- పట్టించుకోని అధికారులు

కేతేపల్లి : ఓ వైపు కరువు పరిస్థితులు ఏర్పడి ప్రజలు తాగు, సాగు నీటికి అవస్థలు పడుతుంటే.. కేతేపల్లి మండలంలో మూసీ నీరు వృథాగా పోతోంది. మండలంలోని బొప్పారం ఊరకుంట మూసీ రిజర్వాయర్‌కు దిగువనే ఉంది. మూసీ రిజర్వాయర్ కుడి ప్రధాన కాల్వలోకి విడుదల చేసిన నీరు మొదటగా ఈ చెరువు (బ్యాలెన్సింగ్ రిజర్వాయర్)లోకి చేరిన తర్వాత దిగువ ఆయకట్టు వెళ్తుంది. యాసంగి సీజన్‌లో ఆయకట్టులో పంటల సాగుకు మార్చి నెలాఖరు వరకు అధికారులు నీరు వదలడంతో బొప్పారం ఊరకుంటలో నీరు నిండుగా ఉంది. అయితే కాల్వకు నీటిని విడుదల చేసే తూము ధ్వంసమై నిర్మాణానికి వాడిన రాళ్లెంల లోపలి వైపున కూలిపోయాయి. దీంతో తూము షట్టర్ పక్కన ఖాళీ ఏర్పడి పెద్ద ఎత్తున నీరు కాల్వలోకి పోతోంది. రోజూ దాదాపు 50 క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవటంపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువుకు ప్రస్తుతం మూసీ రిజర్వాయర్ కాల్వ తూము నుంచి జాలు కూడా వస్తోంది. కానీ, లీకేజీ ఇలాగే కొనసాగినట్లయితే పది రోజుల్లో చెరువులో అడుగంటే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి లీకేజీని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రూ.44.20 లక్షలు మంజూరయ్యాయి

బొప్పారం చెరువు తూము పూర్తిగా శిథిలావస్థకు చేరింది. మరమ్మతులు చేసినా ప్రయోజనం లేదు. నూతనంగా తూము నిర్మించేందుకు ప్రభుత్వం ఇటీవల రూ.44.20 లక్షలు మంజూరు చేసింది. టెండర్ ఖరారయ్యే దశలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చింది. త్వరలోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి నూతన తూముల నిర్మాణ చేపడతాం. అప్పటి వరకు నీరు లీకేజీ కాకుండా తాత్కాలికంగా మరమ్మతు చేస్తాం.

– ఉదయ్, ఏఈ, మూసీ డ్యాం

సన్నాహక సమావేశాల్లో బీఆర్‌ఎస్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: భువనగిరి, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో అసెంబ్లీ సెగ్మెంట్‌ల వారీగా బీఆర్‌ఎస్ పార్టీ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తోంది. ఈనెల 6వ తేదీన తుంగతుర్తిలో సమావేశం నిర్వహించగా, సోమవారం మునుగోడు అసెంబ్లీ పరిధిలో సన్నాహక సమావేశం నిర్వహించింది. 10వ తేదీన ఉదయం సూర్యాపేటలో సమావేశం నిర్వహించనుంది. 12వ తేదీన ఉదయం కోదాడ, మధ్యాహ్నం హుజూర్‌నగర్‌లో, 13న ఉదయం నకిరేకల్, మధ్యాహ్నం ఆలేరు సమావేశాలను నిర్వహించేలా చర్యలు చేపట్టింది. 14న మిర్యాలగూడ, 15న భువనగిరి సమావేశం, 16వ తేదీన ఉదయం దేవరకొండ, మధ్యాహ్నం నాగార్జునసాగర్ అసెంబ్లీ నియోజకవర్గాల సన్నాహక సమావేశాలను నిర్వహించనుంది.

నీటి కష్టాలు తీర్చేలా..

- సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసిన నీలగిరి మున్సిపల్ యంత్రాంగం
- రూ.65 లక్షలు కేటాయించిన మున్సిపాలిటీ



ట్యాంకర్ నుంచి నీటిని తీసుకెళ్తున్న ప్రజలు

నల్లగొండ టూటౌన్ : వేసవిలో తాగు నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు నీలగిరి మున్సిపాలిటీ సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. నీటి ఇబ్బందులను అధిగమించేందుకు మున్సిపాలిటీ నుంచి రూ.65 లక్షలు కేటాయించారు. మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డులలో 300 చేతిపంపులు, 200 వరకు పవర్ బోర్స్ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిలో కొన్ని చేతి పంపులు వినియోగంలేవు. పవర్ బోర్స్, చేతి పంపుల మరమ్మతు సామగ్రి కోసం రూ.30 లక్షలు ఖర్చవుతాయని అంచనా వేశారు. అదే విధంగా మరో రూ.10 లక్షలతో ఇతర మెటీరియల్ కొనుగోలు చేయాలని నిర్ణయించారు. అద్దె ట్యాంకర్లు కోసం రూ. 25 లక్షల వ్యయం కానుందని.. ఇప్పటికే 10 అద్దె ట్యాంకర్లను తీసుకొని నీటి సమస్య ఉన్న ప్రాంతాలకు పంపుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. మున్సిపాలిటీకి సొంతంగా 6 ట్యాంకర్లు ఉన్నాయి. మొత్తంగా 16 ట్యాంకర్ల ద్వారా పట్టణ శివారు ప్రాంతాల్లో నీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలకు నీటిని అందించనున్నారు. అత్యవసరమైతే కొత్తగా బోర్లు వేయడానికి జిల్లా ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకోనున్నారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కొత్తగా బోర్లు వేస్తే నీరు పడుతుందా.. అనే సందిగ్ధంలో మున్సిపల్ అధికారులు ఉన్నారు.

15 బోర్ల నుంచి నీరు బంద్..

నీలగిరి పట్టణంలోని కేశరాజుపల్లి, కతాల్‌గూడ, అర్జున్‌కాలనీ, ఏఆర్ నగర్ తదిరత ప్రాంతాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోయినట్లు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో ఉన్న 15 బోర్ల నుంచి నీరు రావడం పూర్తి ఆగిపోయింది. ఇలాంటి ప్రాంతాల్లో కొత్తగా బోర్లు వేసినా పడే పరిస్థితులు లేవని అధికారులు చెబుతున్నారు. పరిస్థితి చేయిదాటినప్పుడు సమీపంలోని రైతుల బోర్ల నుంచి నీటిని తీసుకునే వెసులుబాటు ఉంటుంది. అక్కడి రైతుల బోర్లలో కూడా నీరు ఉంటేనే ఇది సాధ్యపడనుంది. 15 పవర్ బోర్ల నుంచి నీరు నిలిచిపోవడంతో ఆయా కాలనీల్లో నీటి సమస్య తలెత్తుతుంది.

తాగు నీటికే ప్రాధాన్యం..

ప్రస్తుత పరిస్థితుల్లో నీటి ఎద్దడి తీర్చేందుకు మున్సిపల్ యంత్రాంగం అప్రమత్తమైంది. కాలనీల్లో తాగు నీరు లేని ప్రాంతాలను గుర్తించి ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నారు. కానీ వేసవిలో నీటి వాడకం పెరగనున్నందున ట్యాంకర్లు ఎక్కువగా కావాలని డిమాండ్లు వస్తున్నాయి. కానీ మున్సిపల్ అధికారులు మాత్రం తాగు నీటిని అందిస్తాం.. కానీ, వాడుకునే నీటిని కూడా ట్యాంకర్ల ద్వారా అందించాలంటే సాధ్యమయ్యే అవకాశం ఉండదని చెబుతున్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూస్తాం

నీలగిరి పట్టణంలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. 10 అద్దె ట్యాంకర్లు తీసుకున్నాం. మున్సిపాలిటీకి ఆరు ఉన్నాయి. 16 ట్యాంకర్లు ద్వారా కాలనీలకు నీటిని అందిస్తాం. ఇప్పటి వరకు 15 బోర్లు పూర్తిగా ఎండిపోయాయి.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

రామన్నపేట ఎంపీపీగా బాలమణి ఎన్నిక

రామన్నపేట: రామన్నపేట ఎంపీపీ పదవిని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. సోమవారం జరిగిన ఎన్నికల్లో ఎంపీపీగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇంద్రపాలనగరం ఎంపీటీసీ పూస బాలమణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి ఎన్నికల అధికారిగా ఎంపీపీ ఎన్నికకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి కాంగ్రెస్‌కు చెందిన ఎంపీపీతోపాటు మరో ఏడుగురు ఎంపీటీసీలు, సీపీఎంకు చెందిన ముగ్గురు సభ్యులు హాజరయ్యారు. బీఆర్‌ఎస్‌కు చెందిన ఐదుగురు ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. ముందుగా ఎంపీపీ పేరును సీపీఎం చెందిన సిరిపురం ఎంపీటీసీ బడుగు రమేష్ ప్రతిపాదించగా కాంగ్రెస్ పార్టీకి చెందిన రామన్నపేట–2 ఎంపీటీసీ ఎండీ రెహాన్ బలపరిచారు. పోటీలో మరెవరూ లేకపోవడంతో బాలమణి ఎంపీపీగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం ఎంపీపీ చాంబర్‌లో ఆమె చేత పదవీ ప్రమాణ స్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. నూతన ఎంపీపీకి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీపీ కార్యాలయం నుంచి జేపీ గార్డెన్స్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ పి.మల్లయ్య బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ బి.యాకుబ్ నాయక్, పలువురు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజలకు 'గుత్తా' ఉగాది శుభాకాంక్షలు

నల్లగొండ టూటౌన్ : క్రోధినామ సంవత్సరం ఉగాది పండుగను జిల్లా ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటనలో ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. షడ్రుచుల సమ్మేళనమే ఈ ఉగాది పండుగని పేర్కొన్నారు. జీవితంలో వచ్చే కష్టసుఖాలను అందరూ అనుభవించాలని గుర్తు చేసేదే ఉగాది పచ్చడి అని తెలిపారు. క్రోధినామ సంవత్సరం అందరికీ కలిసి వచ్చి సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు.

పుస్తెల తాడు అపహరణ

భువనగిరి క్రైం : గుర్తుతెలియని వ్యక్తి మహిళ మెడలో పుస్తెల తాడును అపహరించాడు. ఈ ఘటన భువనగిరి మండలం చీమలకొండూరు గ్రామంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చీమలకొండూరు గామానికి చెందిన పల్లెర్ల రేణుక, బాలస్వామి దంపతులు తమ ముగ్గురు పిల్లలతో కలిసి ఆదివారం రాత్రి ఇంటి స్లాబ్‌పై నిద్రపోయారు. తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి వచ్చి రేణుక మెడలోని పుస్తెల తాడును దొంగిలించి పారిపోయాడు. బాధితురాలు కేకలు వేయగా పరారయ్యాడు. సీఐ ప్రభాకర్ రెడ్డి, ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

విజయవాడ వాసి ఆత్మహత్య

మునగాల(కోదాడ): చేయి కోసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మునగాల మండలం ముకుందాపురంలో సోమవారం జరిగింది. విజయవాడకు చెందిన దుగ్గినేని రాంబాబు(60) ముకుందాపురం శివారులోని హైవే పక్కన రక్తపు మడుగులో పడిపోయాడు. స్థానికులు గమనించి అతడిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు. అతడి చేయికి తీవ్ర గాయమై ఉంది. వ్యక్తిగత కారణాలతో రాంబాబు ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. మహిళ దుర్మరణం

తుర్కపల్లి: రెండు బైక్‌లు ఢీకొని ఓ మహిళ దుర్మరణం చెందింది. తుర్కపల్లి మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి మండలం తిమ్మాపూర్‌కు చెందిన డొంకెని రాజమణి (58), తన భర్త వెంకట్రాములుతో కలిసి తుర్కపల్లి మండల కేంద్రంలో ఉంటున్న బంధువుల ఇంటికి బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యలో ములకలపల్లి స్టేజి దాటిన తర్వాత బంక్‌లో పెట్రోల్ పోయించుకుని తిరిగి రోడ్డుపైకి వస్తున్నారు. ఈ క్రమంలో తుర్కపల్లి నుంచి ముగ్గురు యువకుల బైక్ వెంకట్రాములు బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని భువనగిరి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో రాజమణి మృతి చెందింది. వెంకట్రాములు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు., మృతురాలికి ఇద్దరు కొడుకులు, ఓ కూతురు ఉన్నట్లు ఫిర్యాదు మేరకు ఎస్ఐ తక్యూద్దిన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మోత్కూరులో ప్రత్యేకంగా ఉగాది

● నేడు గ్రామ దేవతలకు బోనాలు ● ప్రత్యేక ఆకర్షణగా ఎడ్లబండ్ల ప్రదర్శన

మోత్కూరు : తెలుగు నూతన సంవత్సర పర్వదినమైన ఉగాదిని మోత్కూరులో ప్రత్యేకంగా జరుపుకుంటున్నారు. ఈ పండుగ రోజు గ్రామ దేవతలకు బోనాలు సమర్పించడంతో పాటు ఎడ్ల బండ్లు, వాహనాలను ప్రదర్శించడం ప్రతి యేటా సంప్రదాయంగా కొనసాగిస్తున్నారు.

90 ఏళ్లుగా...

పూర్వ కాలంలో అక్కడ వేసవి సీజన్‌లో మహమ్మారి సోకి పలువురు చనిపోయేవారు. దీంతో గ్రామంలో కొలువై ఉన్న ముత్యాలమ్మ తల్లి ఆగ్రహానికి గురైనట్లు నాడు ప్రజలు భావించారు. దీంతో గ్రామ పెద్దలు ఒక నిర్ణయానికి వచ్చారు. ఉగాది పర్వదినం రోజున ఊరంతా డప్పు చప్పుళ్లతో బోనాలను ఊరేగించి నైవేద్యంగా సమర్పించడంతో పాటు జంతువులను బలి ఇచ్చి అమ్మవారిని శాంతింపజేసినట్లు ప్రచారంలో ఉంది. అప్పటి నుంచి 90ఏళ్లుగా సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

ఊరంతా ఊరేగింపుగా వెళ్లి..

పర్వదినం రోజు మహిళలు పట్టణంలో బోనాలతో ప్రదర్శన నిర్వహిస్తారు. ఎడ్ల బండ్లు, వాహనాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేస్తారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణకు సామూహికంగా బోనాలతో చేరుకుంటారు.



మోత్కూరులో బోనాలతో ప్రదర్శనగా వెళ్తున్న భక్తులు (ఫైల్)

ఆ తర్వాత చెరువు కట్టపై కొలువై ఉన్న తూర్పు ముత్యాలమ్మ, అంగడి బజార్‌లోని పడమర ముత్యాలమ్మ తల్లి ఆలయాల వద్దకు ఊరేగింపుగా వెళ్లి ప్రదక్షిణలు చేస్తారు. అమ్మవార్లకు బోనాలను నైవేద్యంగా సమర్పిస్తారు. ఉదయం నుంచే మహిళలు ముత్యాలమ్మ తల్లి దగ్గరకు వెళ్లి నూతన వస్త్రాలను సమర్పించి వడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకుంటారు. అత్తవారింటికి నూతన అల్లుళ్లను పిలిపించుకుంటారు. బంధు మిత్రులను ఆహ్వానిస్తారు. మోత్కూరు మున్సిపల్ పరిధిలోని ఆరెగూడెం, జామచెట్లబావి, కొండాపురం, మంగలిగడ్డ ఆవాస గ్రామాల్లో ఉగాదికి బండ్లు, బోనాలు, ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహిస్తారు.

మన ఊరిలో ఉగాది పండుగ

మన ఊరిలో ఉగాది పండుగ
జరుపుకుంటరు జనము గొప్పగా
తల్లి ముత్యాలమ్మనే కొలవగా
సలి బోనాలే ఎత్తిరి భక్తిగా
ఎడ్లబండ్లను గుడిచుట్టూ తిప్పగా
శివసత్తులే శిగాలు ఊగగా
జనమంతా కేరింత కొట్టగా
తల్లి ముత్యాలమ్మ దీవించగా
షడ్ రుచులతో పచ్చడి చేయగా
ప్రజలంతా మైమరచి సేవించగా
బొబ్బట్లు అనే బక్షాలు చేయగా
పరివారమంతా ఆరగించగా
గుడిలోన అందరూ గుమిగూడగా
పంచాంగ శ్రవణం వినిపించగా
ఆదాయ వ్యయాలు లెక్కించగా
ఆనందముతో ఇంటికి చేరగా
దేశంల ఇలాంటి పండుగ
జరుపరు ఎవ్వరూ ఈవిధంగా
నిలిచిపోయింది ఒక చరిత్రగా
మన పుట్టినూరు మోత్కూరేగా

పోచం లక్ష్మీనర్సయ్య,
ప్రభుత్వ హిందీ ఉపాధ్యాయుడు,
మోత్కూరు

గ్రామ దేవతలకు చలి బోనాలు



ఉగాది పండుగ రోజున గ్రామ దేవతలు తూర్పు ముత్యాలమ్మ, పడమర ముత్యాలమ్మకు చలిబోనాలు సమర్పిస్తారు. అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేస్తాం. ఇతర గ్రామాల, పట్టణాల కంటే మోత్కూరులో పండుగకు ప్రత్యేకత ఉంది. ఉగాది రోజు మహిళల ఆనందం మాటల్లో చెప్పలేనిది.

– పరిమెళ్ల అంబ, మోత్కూరు.

ఉగాదికి మోత్కూరుకు రావాల్సిందే



ఎక్కడా లేని విధంగా మోత్కూరులో జరిగే ఈ పండుగకు అందరూ వస్తారు. ఇతర పట్టణాల్లో ఉన్న, సుదూర ప్రాంతాలకు వెళ్లిన మోత్కూరు వాసులు ఉగాదికి తప్పకుండా వస్తుంటారు. ఉగాది వేడుకలను మోత్కూరు పట్టణ ప్రజలు ప్రత్యేకంగా తిలకిస్తారు.

– మత్రి ఆనందం, మోత్కూరు

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రజలను కోరారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ రుణం తీర్చుకోవాలని అన్నారు. సోమవారం చౌటుప్ప పట్టణ కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2009లో తనను ఆశీర్వదించి గెలిపించి ఢిల్లీకి పంపిస్తే 60ఏళ్ల కలను సాకారం చేసే పోరాటంలో భాగస్వాముడినయ్యానని పేర్కొన్నారు. అధిష్టానం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలిపించుకుంటామని తెలిపారు. పార్టీలో ఏమైనా బేదాభిప్రాయాలు ఉంటే కూర్చొని మాట్లాడుకుందామన్నారు. ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని తరిమికొట్టినట్టుగానే ఈ ఎన్నికల్లోనూ బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రంలోని కరువు పరిస్థితులకు



మాట్లాడుతున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీయే కారణమని బీఆర్ఎస్, బీజేపీలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మొద్దన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రాధాన్యతా క్రమంలో హామీలను అమలు చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో మున్సి పల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నర్సింహ, నాయకులు సుర్కంటి వెంకట్‌రెడ్డి, ఎండీ. ఎజాస్ పాష, గోశిక వినయ్‌కుమార్ ఉన్నారు.

ప్రభుత్వ నిధులు కాజేసిన బీపీఎం !

● రూ.4.80 లక్షలను సొంతానికి వినియోగించుకున్న చివ్వెంల బ్రాంచ్ పోస్టుమాస్టర్
● అధికారుల తనిఖీతో వెలుగులోకి..

చివ్వెంల(సూర్యాపేట) : ప్రజలకు పంపిణీ చేయాల్సిన డబ్బులను బీపీఎం స్వాహా చేశాడు. ఈ ఘటన చివ్వెంల మండల కేంద్రంలో సోమవారం వెలుగుచూసింది. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన జల్లా సాయికృష్ణ చివ్వెంల బీపీఎంగా విధులు నిర్వస్తున్నాడు. 732మంది లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు చెల్లించేందుకు గత నెల 22వ తేదీన సూర్యాపేట హెడ్ పోస్టాఫీస్ నుంచి రూ.12లక్షలు తీసుకువచ్చాడు. అదే విధంగా 28వ తేదీన మరో రూ.4లక్షలు తెచ్చాడు. గ్రామంలో రూ.14 లక్షలు పంపిణీ చేశాడు. మిగిలిన నగదుతో పాటు, సుకన్య సమృద్ధి యోజన, సేవింగ్ డిపాజిట్లు, ఆర్‌డీలకు సంబంధించిన మొత్తం రూ.4.80లక్షలు తిరిగి హెడ్ పోస్టాఫీస్‌లో జమ చేయడం లేదు. అనుమానం వచ్చిన అధికారులు బీపీఎంకు ఫోన్ చేయగా రేపు మాపు అంటూ దాటవేస్తూ వస్తున్నాడు. దీంతో సోమవారం అధికారులు పోస్టాఫీస్‌కు వచ్చి రికార్డులు తనిఖీ చేయడంతో నిధులు స్వాహా చేసిన విషయం



రికార్డులు పరిశీలిస్తున్న పోస్టల్ అధికారులు

వెలుగులోకి వచ్చింది. బీపీఎం మొత్తంగా రూ.4.80 లక్షలు సొంతానికి వాడుకున్నట్లు తేలిందని అధికారులు తెలిపారు. సోమవారం సాయిక్రిష్ణ విధులకు రాకపోవడంతో ఆయనకు ఫోన్ చేయగా రెండు రోజుల్లో చెల్లిస్తానని తెలిపినట్లు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాగా, గ్రామానికి చెందిన కొంత మంది తాము ప్రతినెలా రూ.500 ఆర్‌డీలు చెల్లిస్తుంటే రూ.100, రూ.200 మాత్రమే బీపీఎం పాస్‌పుస్తకంలో రాస్తున్నాడని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అదే విధంగా కొద్ది రోజులుగా ఉపాధిహామీ వేతనాలు సరిగా ఇవ్వడం లేదని మరికొంత మంది ఫిర్యాదు చేశారు.ఈ కార్యక్రమంలో ఎంట సుధీర్ బాబు, గ్రామ మాజీ సర్పంచ్ జూలకంటి సుధాకర్ రెడ్డి, రాజుతండా మాజీ సర్పంచ్ ధరావతు భద్రు నాయక్, సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి ఖమ్మంపాటి రాము పాల్గొన్నారు.

మేలైన వరి వంగడాలను ఎంపిక చేసుకోవాలి

● వరంగల్ ప్రాంతీయ పరిశోధనా కేంద్రం ఏడీఆర్ ఉమారెడ్డి

కేతేపల్లి: రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు ఇచ్చే మేలైన వరి వంగడాలని ఎంపిక చేసుకుని సాగు చేపట్టాలని వరంగల్ ప్రాంతీయ పరిశోధనా కేంద్రం ఏడీఆర్(అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్) ఉమారెడ్డి సూచించారు. వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఉత్పత్తి చేసిన 1,537 రకం వరి విత్తనాలను కేతేపల్లి మండలంలోని కాసనగోడు గ్రామానికి చెందిన రైతు సయ్యద్‌బాషా పొలంలో యాసంగి సీజన్లో ప్రయోగాత్మకంగా సాగు చేశారు. ప్రస్తుతం పంట కోత దశలో ఉండటంతో దిగుబడిని అంచనా వేసేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలసి సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఉమారెడ్డి మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అధిక దిగుబడినిచ్చే వరి వంగడాలు ప్రభుత్వ రంగంలో ఉన్నాయని తెలిపారు. 1537 వరి వంగడాన్ని మూడేళ్ల పాటు ప్రయోగాత్మకంగా పరిశీలించిన అనంతరం వచ్చే పంట దిగుబడుల ఆధారంగా రైతులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సతీష్‌చంద్ర, డాక్టర్ వెంకన్న, మాజీ ఎంపీటీసీ సభ్యులు కందుల మోహన్ ఉన్నారు.

డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డికి జాతీయ అవార్డు

నల్లగొండ టౌన్, యాదగిరిగుట్ట: నల్లగొండ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి జాతీయ స్థాయిలో ఉత్తమ సహకార బ్యాంకు అధ్యక్షుడిగా సోమవారం న్యూ ఢిల్లీలో అవార్డు అందుకున్నారు. న్యూఢిల్లీకి చెందిన ఇంటలెక్చువల్ పీపుల్స్ ఫౌండేషన్, నేషనల్ సెమినార్ ఫర్ ఇండివిడ్యువల్ కాంట్రిబ్యూషన్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ డెవలప్‌మెంట్ వారి ఆధ్వర్యంలో సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ సలహాదారు వైస్ చాన్స్‌లర్ కే.ఎస్.రానా, ఎస్‌బీఎస్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ జితేందర్ సింగ్ ఘంటిలు ఈ అవార్డును ప్రదానం చేశారు. సహకార రంగంలో చేసిన కృషికి గాను దేశ వ్యాప్తంగా 500 మందికి ఈ అవార్డులు అందజేశారు. వీరిలో మహేందర్‌రెడ్డి ఒకరు. అవార్డు రావడానికి సహకరించిన బ్యాంక్ వైస్ చైర్మన్, పాలక వర్గ



అవార్డు అందుకుంటున్న మహేందర్‌రెడ్డి

సభ్యులు, జిల్లా రైతాంగానికి, పీఏసీఎస్ చైర్మన్లకు, బ్యాంక్ ఉన్నతాధికారులకు, సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉత్తరాఖండ్ మంత్రి ధన్‌సింగ్ రావత్, ఎంపీ మనోజ్ తివారీ,సురేష్ చంద్ర పాల్గొన్నారు.

డ్రైవర్‌కు పదేళ్ల జైలు

భువనగిరి క్రైం : రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మరణానికి కారణమైన డీసీఎం డ్రైవర్‌కు పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ భువనగిరి జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి మారుతీదేవి సోమవారం తీర్పు వెలువరించారు. బొమ్మలరామారం మండలం చౌదరిపల్లికి చెందిన దండబోయిన జంగమ్మ, దండబోయిన నర్సింహ, దండబోయిన రాజ్యలక్ష్మిలు 2022వ సంవత్సరం జూన్ 9వ తేదీన వలిగొండ మండలంలోని టేకులసోమారం నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. భువనగిరి పట్టణంలోని బచ్‌పన్ స్కూల్ సమీపంలో ఎదురుగా వస్తున్న డీసీఎం డ్రైవర్ అర్బన్ కాలనీకి చెందిన మహ్మద్ అఫ్సర్ పాషా తాగిన మైకంలో వాహనాన్ని నడిపి వీరి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్ వెళ్తునన ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. అప్పటి ఎస్ఐ రాఘవేందర్, సీఐ వేణుగోపాల్, వెంకటయ్యలు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేశారు. అదనపు పీపీ దామోదర్‌రెడ్డి వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి నిందితుడికి పదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. ఈ కేసులో కోర్టు కానిస్టేబుళ్ల పజ్జూరి నాగరాజు, కమ్మంపాటి నరేష్‌లు సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టారు. సహకరించిన పోలీసులను డీసీపీ రాజేష్ చంద్రా, ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, సీఐ ఎం.ప్రభాకర్‌రెడ్డి, భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్ కుమార్‌లు అభినందించారు.

కూతురుతో సహా తల్లి అదృశ్యం

నూతనకల్ : కూతురుతో సహా తల్లి అదృశ్యమైంది. ఈ ఘటన నూతన్‌కల్ మండల కేంద్రంలో సోమవారం వెలుగు చూసింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నూతన్‌కల్ మండల కేంద్రానికి చెందిన అన్నపురి మనీషాతో పాటు కూతురు బృతితలు ఈ నెల 5తేదీ నుంచి కనిపించడం లేదు. భర్త విజయ్‌తో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులను విచారించగా ఆచూకీ లభించ లేదు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో భర్త విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యాదాద్రి ప్రధానాలయంలో సెల్‌ఫోన్లు నిషేధం

యాదగిరిగుట్ట: యాదాద్రి ప్రధానాలయంలోకి సెల్‌ఫోన్లను తీసుకెళ్లడాన్ని నిషేధిస్తున్నట్లు ఎండోమెంట్ ఆఫీసర్ భాస్కర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. యాదగిరికొండపైన సోమవారం నిర్వహించిన శాఖాధిపతుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జర్నలిస్టులతో పాటు ప్రధానాలయంలో విధులు నిర్వహించే మినీస్టీరియల్ సిబ్బంది, మతపర సిబ్బంది, నాల్గవ తరగతి, ఎస్‌పీఎఫ్, హోంగార్డులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, ఆలయంలో విధులు నిర్వహించే సమయంలో సెల్‌ఫోన్స్ తీసుకొని వెళ్లకుండా నిలుపుదల చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని ఆదేశించారు.

హెచ్‌ఎం అసభ్యకర ప్రవర్తనపై ఫిర్యాదు

గుండాల : ప్రధానోపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని తల్లిదండ్రులు సోమవారం గుండాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుండాల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు అండెం మాధవరెడ్డి కొన్ని రోజులుగా పలువురు విద్యార్థినులను తన ఆఫీసు రూమ్‌లోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. విద్యార్థినుల ఒంటిపై చేతులు వేస్తున్నాడని తెలిపారు. బాధిత విద్యార్థినుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాకన్న తెలిపారు.

కారును ఢీకొట్టిన బైక్.. ఇద్దరికి గాయాలు

చిట్యాల: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన చిట్యాల పట్టణంలో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళానికి చెందిన జి.గౌతం, లలితసాయి బైక్‌పై హైదరాబాద్ వైపునకు వెళ్తున్నారు. మార్గమధ్యలో చిట్యాలలోని బస్‌స్టేషన్ ఎదురుగా యూటర్న్ రోడ్డు వద్ద ముందు వెళుతున్న కారును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

సూర్యాపేట : బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన వివరాలు సీఐ రాజశేఖర్ వెల్లడించారు. సూర్యాపేటలోని కొత్తబస్టాండ్ సమీపంలో వాహనాల తనిఖీ చేస్తుండగా బైక్‌పై వస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. విచారణలో ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రానికి చెందిన సాకాని పవన్‌కళ్యాణ్‌గా గుర్తించామన్నారు. నిందితుడు జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో బైక్ చోరీలకు పాల్పడుతున్నాడని, అతడి నుంచి ఐదు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐలు కుశలవ, లోకేష్, సిబ్బంది కృష్ణ, కరుణాకర్, ఆనంద్, మధు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయకపోవడంపై నిరసన

అడ్డగూడూరు: యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యాన్ని దగ్ధం చేశారు. ఈ నెల 1వ తేదీన కొనుగోలు కేంద్రం ప్రారంభించారని, నేటికీ ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు. అకాల వర్షాలు వస్తే ధాన్యం తడవకుండా కాపాడుకోవడానికి టార్పాలిన్లు ఇవ్వాలని కోరితే.. అవి లేవని అంటున్నారని రైతులు చెప్పారు. అధికారికంగా ధాన్యం కొనుగోలు చేయడానికి మిల్లర్లకు అలాంట్‌మెంట్ ఇవ్వలేదని అధికారులు చెబుతున్నారని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో రైతులు సోమిరెడ్డి పురుషోత్తంరెడ్డి, బైరెడ్డి నర్సిరెడ్డి, దాసరి బాలరాజు, ఆసర్ల బీరుమల్లు, గజేల్లి రవి తదితరులు పాల్గొన్నారు.



అడ్డగూడూరులో ఐకేపీ కేంద్రంలో ధాన్యాన్ని దహనం చేసి నిరసన తెలుపుతున్న రైతులు

హాస్టల్ అటెండర్ అదృశ్యం

కోదాడరూరల్ : అధికారులు వేధిస్తున్నారని.. అందుకే చనిపోతున్నానని ఓ అటెండర్ సూసైడ్‌న రాసి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన కోదాడలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడ పట్టణంలోని నయానగర్‌లోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో కాంపాటి గోపయ్య అటెండర్‌గా పనిచేస్తున్నాడు. అతన్ని హెచ్‌డబ్ల్యూఓ లతీమున్, ఏసీడబ్ల్యూ ఎస్తేర్‌లు వేధిస్తున్నారని సూసైడ్ నోట్ రాసి ఆదివారం రాత్రి నుంచి కనిపించకుండా పోయాడు. జ్యోతి నన్ను క్షమించు నేను చనిపోతున్నాను.. నా చావుకు కారణం ఆ ఇద్దరు అధికారులేనని, వారు రెండు నెలల నుంచి జీతాలు రాకుండా, మెడికల్ బిల్స్, 12సంవత్సరాల ఇంక్రిమెంట్ రానివ్వకుండా చేస్తూ ఆర్థికంగా, మానసికంగా ఇబ్బంది గురిచేస్తున్నారని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. ఈ ఘటనపై గోపయ్య భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగాల పేరిట మోసం

ఖమ్మం క్రైం: మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలకు పాల్పడుతున్న వారిలో ఒకరిని ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. నల్లగొండ జిల్లాకు చెందిన పారేపల్లి సాయికృష్ణ, బయ్యా రవీందర్ ప్రముఖ కంపెనీల్లో రూ.వేల జీతానికి ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురికి ఫోన్ మెసేజ్‌లు చేస్తూంటారు. ఈ మెసేజ్‌కు ఖమ్మంకు చెందిన ఓ వ్యక్తి స్పందించగా.. పలు దఫాల్లో రూ.35వేలు పంపించాడు. ఈ డబ్బును సాయికృష్ణ, రవీందర్ నేరుగా తమ ఖాతాలకు కాకుండా కిరాణషాపులు, పెట్రోల్‌బంక్‌లకు జమ చేయించుకున్నారు. ఆ తర్వాత స్పందించకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన ఖమ్మం వాసి.. సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సోమవారం రవీందర్‌ను అరెస్ట్ చేశారు. సాయికృష్ణ కోసం గాలిస్తున్నారు.

ఆస్పత్రి ఎదుట ఆందోళన

● వైద్యుడి నిర్లక్ష్యంతోనే బాలుడు మృతిచెందాడని బంధువుల ఆరోపణ



శిశువు మృతదేహం

హాలియా : వైద్యుల నిర్లక్ష్యంతో బాలుడు మృతిచెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటన సోమవారం హాలియాలో చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి (సాగర్) మండలంలోని జాల్‌తండాకు చెందిన జటావత్ వెన్నెల, రవీందర్ నాయక్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ దంతుల రెండో సంతానం ఐదు నెలల బాలుడు దగ్గు, జ్వరంతో బాధపడుతుండగా సోమవారం హాలియాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. చికిత్స అనంతరం బాలుడిని ఇంటికి తీసుకెళ్లారు. సాయంత్రం బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అదే ఆస్పత్రికి మరోమారు తీసుకవచ్చారు, అప్పటికే శిశువు మృతిచెందినట్లు వైద్యుడు నిర్ధారించాడు. వైద్యం వికటించడం కారణంగానే బాలుడు మృతి చెందాడని బంధువులు ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలం వద్దకు చేరుకున్నారు. శిశువు పరిస్థితి ఆందోళన కరంగా ఉన్న విషయం ముందస్తుగా తల్లి జటావత్ వెన్నెలకు తెలిపి వైద్యం చేశానని, ఆరోగ్యం మెరుగుపడ్డాక ఇంటికి తీసుకెళ్లారని డాక్టర్ తరీష్‌బాబు తెలిపాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.